


కలం కౌంటర్
KALAM COUNTER TELUGU DAILY
తెలుగు దినపత్రిక
సంపుటి : 8 సంచిక : 345
పేజీలు : 4 వెల రూ.4/-
Circulated by : Krishna, Guntur, Prakasam, Nellore, West Godavari, Khammam, Hyderabad, Chittor
సోమవారం 28 ఏప్రిల్ 2025

# నిన్నటి విధ్వంసం నుంచి రేపటి వికాసం వైపు అమరావతి

- రాజధాని నిర్మాణం రాష్ట్రానికి నవోదయం
- రాష్ట్రంలోని ప్రతి పౌరుడు గర్వపడేలా ప్రజా రాజధాని : సిఎం చంద్రబాబు
- క్యాపిటల్ రీ స్టార్ట్ కార్యక్రమంపై సమీక్ష-ప్రధాని సభ గ్రాండ్ సక్సెస్ చేయాలన్న సిఎం



**అమరావతి, కలంకౌంటర్ :** ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా రాజధాని అమరావతి పనుల పున:ప్రారంభ కార్యక్రమంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమీక్ష నిర్వహించారు. ఉండవల్లి నివాసంలో మంత్రులు, ఉన్నతాధికారులతో మే2వ తేదీన జరిగే సభ ఏర్పాట్లపై చర్చించారు. ప్రధాని చేతుల మీదుగా అమరావతి పనులు మళ్లీ ప్రారంభం అవుతున్నాయని... ఆ రోజు రాష్ట్ర చరిత్రలో గొప్ప మలుపు కానుందని సిఎం అన్నారు. నిన్నటి విధ్వంసం నుంచి రేపటి వికాసం వైపు రాష్ట్ర రాజధాని ప్రయాణం సాగనుందని సిఎం అన్నారు. గత ప్రభుత్వం అమరావతిని దెబ్బతీ-యాలని అనేక కుట్రలు, దాడులు చేసిందని... అయితే అన్ని ప్రాంతాల, అన్ని వర్గాల ప్రజల అభిలాష మేర ప్రారంభమైన అమరావతి అనేక సవాళ్లను, కష్టాలను ఎదుర్కొని నిలబడిందని సిఎం అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 10 నెలల్లో... గత ప్రభుత్వ కారణంగా తలెత్తిన సవాళ్లను పరిష్కరించి, నిలిచిపోయిన పనులను మళ్లీ పట్టాలెక్కిస్తున్నామని సిఎం అన్నారు. ఏ ప్రధాని చేతుల మీదుగా అయితే శంకుస్థాపన చేసిన రాజధానిని విధ్వంసం చేశారో... నేడు మళ్లీ అదే ప్రధాని చేతుల మీదుగా పనులు తిరిగి ప్రారంభించి... ఒక అద్భుత రాజధానిని నిర్మించి... విధ్వంసకారులకు గట్టి సమాధానం చెబుతున్నామని సిఎం అన్నారు. అమరావతి అనేది ఆంధ్రప్రదేశ్ ప్రజల ఆత్మగౌరవం, ఆకాంక్ష, సెంటిమెంట్ అని... దీన్ని ఎవరూ దెబ్బతీయలేరని సిఎం అన్నారు. అమరావతి సంపద సృష్టి కేంద్రంగా, అన్ని వర్గాల ప్రజలకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించే ప్రాంతంగా మారుతుందని సిఎం అన్నారు. కుట్రలకు, కుతంత్రాలకు ప్రజా రాజధాని, ఆంధ్రుల స్వప్నాన్ని ఎవరూ చెరిపివేయలేరని చాటి చెప్పేందుకే... మళ్లీ దేశం అంతా గుర్తించేలా రాజధాని పనులను స్వయంగా ప్రధాని చేతుల మీదుగా పున: ప్రారంభిస్తున్నామని సిఎం అన్నారు. ఈ కార్యక్రమాన్ని అత్యంత ఘనంగా, వేడుకగా నిర్వహించాలని... రాష్ట్రంలోని ప్రతి పౌరుడు 'నాది ఆంధ్ర ప్రదేశ్... నా రాజధాని అమరావతి' అని చెప్పుకునేలా అమరావతి నిర్మాణం జరుగుతుందన్నారు. ప్రధాని కూడా రాజధాని నిర్మాణంపై ఆసక్తితో ఉన్నారని...

- 2లో

# జూబ్లీహిల్స్ నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో సమావేశం అయిన శాంతి చర్చల కమిటీ నేతలు..





**హైదరాబాద్,కలంకౌంటర్ :** మావోయిస్టులతో కేంద్ర ప్రభుత్వం శాంతి చర్చలు జరిపేలా చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి. కాల్పుల విరమణకు కేంద్రాన్ని ఒప్పించాలని ముఖ్యమంత్రి ని కోరిన నేతలు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి వినతిపత్రం అందజేసిన శాంతి చర్చల కమిటీ కన్వీనర్ జస్టిస్ చంద్రకుమార్, ప్రొఫెసర్ హరగోపాల్, ప్రొఫెసర్ అన్వర్ ఖాన్, దుర్గాప్రసాద్, జంపన్న, రవి చందర్. శాంతి చర్చల కమిటీ నేతలతో సీఎం రేవంత్ రెడ్డి. నక్సలిజాన్ని మా ప్రభుత్వం సామాజిక కోణంలో మాత్రమే చూస్తుంది తప్ప శాంతిభద్రతల అంశంగా పరిగణించదు. గతంలో నక్సలైట్ల తో చర్చలు జరిపిన అనుభవం సీనియర్ నేత జానారెడ్డి కి ఉంది. ఈ అంశంపై సీనియర్ నేత జానారెడ్డి సలహాలు , సూచనలు తీసుకుంటాం. మంత్రులతో చర్చించి ఒక నిర్ణయాన్ని తీసుకుంటాం.

# ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తాం - రాష్ట్ర మంత్రి టీజీ భరత్



**అమరావతి,కలంకౌంటర్ :** ఎన్నికల్లో మాట ఇచ్చిన విధంగా ప్రతి ఒక్క హామీని తప్పకుండా నెరవేరుస్తామని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. ఎన్నికల హామీ మేరకు మత్స్యకారుల సేవలో పథకాన్ని ప్రారంభించి వేట విరామ సమయంలో మత్స్యకారులకు ఆర్థిక సాయాన్ని రూ.10,000 నుంచి రూ.20,000కు పెంచి విడుదల చేయడం జరిగిందని ఒక ప్రకటన ద్వారా మంత్రి తెలిపారు. ఈ పథకం ద్వారా 1,29,178 మత్స్యకార కుటుంబాలకు లబ్ధి చేకూరుతుందని మంత్రి పేర్కొన్నారు. సముద్రంలో వేట నిషేధ సమయంలో మత్స్యకారులు ఇబ్బందులు పడకుండా ఆర్థిక సాయం చేయాలని తమ ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందన్నారు. గత పాలకులు ఫిష్ ఆంధ్ర పేరుతో రూ. 300 కోట్లు ఖర్చు పెట్టామన్నారు. ఒక్క మత్స్యకారుని కుటుంబమైనా బాగుపడిందా అని ఆయన ప్రశ్నించారు. 2014లో తొలిసారిగా తెలుగుదేశం ప్రభుత్వమే వేట నిషేధ సమయంలో మత్స్యకార కుటుంబాలకు భృతిని ప్రవేశ పెట్టిందని.. కూటమి ప్రభుత్వం రాకతో మత్స్యకారుల దశ మారిందని తెలిపారు. 2014-2019 మధ్య మత్స్యకారుల సంక్షేమం కోసం రూ.788 కోట్లు ఖర్చు పెట్టినట్లు తెలిపారు. రాష్ట్రంలో 68,396 మంది మత్స్యకారులకు నెలనెలా పింఛన్లు అందిస్తున్నామని, మత్స్యకారులు చేపల వేట సమయంలో మరణిస్తే రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియో చెల్లిస్తున్నామన్నారు. అంతేకాకుండా వేటకు వెళ్లే బోట్లకు లీటర్ డీజిల్‌పై రూ.9 సబ్సిడీ ఇస్తున్నట్లు తెలిపారు. చేపల ఎగుమతుల్లో మన రాష్ట్రం ముందువరుసలో ఉందన్నారు. రాష్ట్రంలో 555 మత్స్యకార గ్రామాలున్నాయని, దేశంలో ఉత్పత్తయ్యే మత్స్యసంపదలో 29 శాతం మన రాష్ట్రం నుంచే ఉంటోందన్నారు. మత్స్య ఉత్పత్తుల ద్వారా 16.50 లక్షల మందికి ఉపాధి లభిస్తోందని పేర్కొన్నారు. చేపల పెంపకం వల్ల ఎన్నో లాభాలున్నాయని, ప్రజలు ఆరోగ్యంగా ఉండాలంటే చేపలు తినాలని మంత్రి పేర్కొన్నారు.

# సింహాచలం చందనోత్సవానికి సర్వం సిద్ధం

- అప్పన్న చందనోత్సవ ఏర్పాట్లను పరిశీలించిన హెూం మంత్రి వంగలపూడి అనిత
- రెండు లక్షల మంది భక్తులు వస్తారని అంచనా ఉంది
- ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసాం
- సమాన్య భక్తులకు అధిక ప్రధాన్యత ఇస్తున్నాం హెూం మంత్రి అనిత






**విశాఖపట్నం,కలంకౌంటర్ :** ఈనెల 30న సింహాచలం శ్రీ వరాహలక్ష్మీ నరసింహ స్వామి వారి వార్షిక చందనోత్సవం ఘనంగా జరగనుంది. ఉత్సవ ఏర్పాట్లను రాష్ట్ర హెూం మంత్రి వంగలపూడి అనిత పరిశీలించారు. ఈ సందర్భంగా స్వామివారిని దర్శించుకున్న మంత్రికి ఆలయ అధికారులు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికి, స్వామివారి చిత్రపటం, ప్రసాదం అందజేశారు. పండితులు వేదాశీర్వచనాలు అందించారు. ఈ సందర్భంగా మంత్రి అనిత మాట్లాడుతూ, సామాన్య భక్తులకు అధిక ప్రాధాన్యత ఇస్తూ, వారి సౌకర్యాల కోసం అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు. ట్రాఫిక్ సమస్య లేకుండా ప్రత్యేక చర్యలు చేపట్టామని, పెద్ద సంఖ్యలో బస్సులు అందుబాటులో ఉంటాయి అని తెలిపారు. గతంలో ఎన్నడు లేనివిధంగా ఐదుగురు మంత్రులతో కూడిన బృందం సమీక్షించారన్నారు. అంతరాలయ దర్శనాలు ఉదయం ఆరు గంటలకు ముగిసేలా ఏర్పాట్లు చేశామన్నారు. ఇటీవల ఎన్డీయే ప్రభుత్వ అధ్వర్యంలో జరిగిన అనేక ఆలయ ఉత్సవాల విజయవంతం నేపథ్యంలో ఈ ఉత్సవం పట్ల భక్తుల్లో విశ్వాసం పెరిగిందని, స్వామివారి నిజరూప దర్శనానికి సుమారు రెండు లక్షల మంది భక్తులు హాజరయ్యే అవకాశం ఉందని హెూం మంత్రి అనిత తెలిపారు.




# సామాన్య భక్తులకు పెద్దపీట వేస్తూ టీటీడీ కీలక నిర్ణయం

**తిరుమల ,కలంకౌంటర్ :** తిరుమల శ్రీవారి దర్శనానికి విచ్చేసే సామాన్య భక్తులకు అధిక ప్రాధాన్యత కల్పించే దిశగా తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ఒక కీలక నిర్ణయం తీసుకుంది. పెరుగుతున్న భక్తుల రద్దీని, ముఖ్యంగా వేసవి సెలవులను దృష్టిలో ఉంచుకుని, వీఐపీ బ్రేక్ దర్శన సమయాల్లో మార్పులు చేసింది. ఈ కొత్త విధానం మే 1వ తేదీ నుంచి ప్రయోగాత్మకంగా అమలులోకి రానుంది. టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు అధ్యక్షతన ఇటీవల జరిగిన పాలకమండలి సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. కొత్త షెడ్యూల్ ప్రకారం, మే 1వ తేదీ నుంచి వీఐపీ బ్రేక్ దర్శనాలను ఉదయం 6 గంటలకు ప్రారంభించనున్నారు. ప్రస్తుతం అమలులో ఉన్న సమయాన్ని ముందుకు జరపడం ద్వారా, తర్వాతి స్లాట్లలో సామాన్య భక్తులకు దర్శనానికి ఎక్కువ సమయం కేటాయించ వచ్చని టీటీడీ భావిస్తోంది. అంతేకాకుండా, వేసవి సెలవుల కాలంలో (మే 1 నుంచి జూలై 15వ తేదీ వరకు) వీఐపీ బ్రేక్ దర్శనాల విషయంలో మరిన్ని మార్పులు చేశారు.



# ఉగ్రదాడిపై "మానవత" ఆగ్రహం

● పర్యాటకుల మృతికి ఘన నివాళి ● మతోన్మాద పాక్ ముష్కరులు మూల్యం చెల్లించక తప్పదు



**తిరుపతి,కలంకౌంటర్ :** కాశ్మీర్ లోని పహల్గాంలో మతోన్మాద పాక్ ఉగ్రవాదులు పర్యాటకులపై విచక్షణారహితంగా దాడి చేసి కాల్చి చంపిన పాక్ ముష్కరులు మూల్యం చెల్లించక తప్పదని తిరుపతి మానవత శాఖ తీవ్రంగా హెచ్చరించి, ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆదివారం ఉదయం తిరుపతిలోని రుద్రరాజు సంపూర్ణమ్మ గార్డెన్స్ లో జరిగిన సమావేశంలో మానవతా సభ్యులు ముష్కరుల దాడిలో మృతి చెందిన హిందూ బంధువులకు మౌనం పాటించి, ఘన నివాళి అర్పించారు. కాశ్మీర్ ఘటనను మతోన్మాద దుర్మార్గపు చర్యగా అభివర్ణించారు. ఓంకారంతో పుష్పాంజలి ఘటించి భారత్ మాతాకీ జై, వందేమాతరం, జైశ్రీరామ్ అంటూ నినాదాలు చేశారు. పాక్ ఉగ్రవాద ముష్కరులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. హిందూ దేశంలో పాక ఉగ్రవాదులను ఏరి పారేయాలి అన్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా భగవంతుని ప్రార్థించారు. అనంతరం మానవతా నెలవారి సమావేశం నిర్వహించి భవిష్యత్తు కార్యాచరణ పై సుదీర్ఘంగా చర్చించారు. ఈ కార్యక్రమంలో మానవతా సెంట్రల్ కమిటీ డైరెక్టర్ ఎన్వి కృష్ణారెడ్డి, చైర్మన్ భార్గవ, కో చైర్మన్ రాళ్లపల్లి మాధవ నాయుడు, అధ్యక్షులు ఎన్వి రమణ, కార్యదర్శి సుకుమార్ రాజు, కోశాధికారి భాస్కర్ రెడ్డి, కమిటీ సభ్యులు వేణుగోపాల్, పద్మనాభం, భాగ్యలక్ష్మి, చంద్రశేఖర్ రెడ్డి, సిరిగిరి శంకర్ రాజు, గురు ప్రసాద్, రిటైర్డ్ ఇన్స్పెక్టర్ కృష్ణయ్య, సాయి కృష్ణమరాజు, సుందర కుమార్ రాజు, కోనేటి రవి రాజు,బాలాజీ నాయుడు, మాధవ రాజు, నరసింహులు, మార్కండేయ రెడ్డి, రామస్వామి, సాయి రెడ్డి, నిరంజన్ నాయుడు, లోక్ సింగ్, షణ్ముగం, రమ-ణయ్య, సుధాకర్ బాబు, నీరజ,భార్గవి, నవీన్, ప్రవీణ్, లోకేష్, సుధాకర్ అధిక సంఖ్యలో మానవతామూర్తులు పాల్గొన్నారు.

# పెనుగొలనులో పదో తరగతి పరీక్షల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు ఘనంగా సత్కారం..



**గంపలగూడెం (ఎన్ టి ఆర్ జిల్లా),కలంకౌంటర్ :** గంపలగూడెం మండలం పెనుగొలనులో పదో తరగతి పరీక్షల్లో ప్రతిభ చూపిన స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చెందిన ముగ్గురు విద్యార్థులకు ఆదివారం షిరిడి సాయిబాబా సేవా కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. కటుకూరి సన (540), సంగెపు స్నేహ (514), సంగెపు మౌనిక (501) కు ఒక్కొక్కరికి రూ.500 చొప్పున ప్రోత్సాహక నగదు, జ్ఞాపిక అందజేసి శాలువాతో సత్కరించారు. భవిష్యత్తులో కూడా మంచిగా చదివి ఉన్నత స్థాయి చేరుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సాయిబాబా సాయిబాబా కమిటీ అధ్యక్షులు వూటుకూరు నారాయణరావు, హైస్కూల్ ఉపాధ్యాయులు ఎన్ వి మురళీకృష్ణ, ఎం వెంకటేశ్వరరెడ్డి, ఎన్ వెంకట నరసింహారావు, విశ్రాంత ప్రిన్సిపాల్ వి. వెంకటరెడ్డి, పేరెంట్స్ కమిటీ చైర్మన్ ఏ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# నక్షతతో భూతగాదాలకు చెక్

**- ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు**



**తిరుపతి,కలంకౌంటర్ :** నక్ష పైలెట్ ప్రాజెక్ట్ కింద తిరుపతిలో డ్రోన్ సర్వే ను ఆదివారం వినాయకసాగర్ లో జెండా ఊపి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ప్రారంభించారు. డ్రోన్ సర్వే తీరును అధికారులు ఎమ్మెల్యేకి వివరించారు. డిజిటల్ ఇండియా ల్యాండ్స్ రికార్డ్ మానిటరింగ్ ప్రోగ్రాం క్రింద కేంద్ర ప్రభుత్వం నక్ష ప్రాజెక్ట్ కింద తిరుపతిని ఎంపిక చేసినట్లు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. రాష్ట్రంలో ఎనిమిది ప్రాంతాలు నక్ష ప్రాజెక్ట్ కు ఎంపికైనట్లు ఆయన చెప్పుకొచ్చారు. నక్ష ప్రాజెక్ట్ కింద జరగనున్న డ్రోన్ సర్వేతో ఆక్రమణలకు చెక్ పడుతుందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. దీంతో నగరంలోని చెరువులు, గుంటలు, కాలువల ఆక్రమణకు గురికాకుండా ఉంటాయని ఆయన చెప్పారు. దీంతో నీటి నిల్వలు పెరగడమే కాకుండా కాలుష్య నియంత్రణకు అవకాశం ఉంటుందని ఆయన వివరించారు. రాష్ట్రంలో గత ఐదేళ్ళలో రీసర్వే పేరుతో భూతగాదాలు పెరిగిపోయాయన్నారు. రెవెన్యూ శాఖలో పారదర్శకత నక్ష ప్రాజెక్ట్ తో సాధ్యమౌతుందని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ఆశాభావం వ్యక్తం చేశారు. డ్రోన్ సర్వే విజయవంతానికి రెవెన్యూ, ప్లానింగ్ విభాగాలు సమన్వయంతో పని చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జి కమిషనర్ అమరయ్య, ఏసిపి బాలాజీ, జనసేన నాయకులు, వీరమహిళలు తదితరలు పాల్గొన్నారు.

# మే 2న అమరావతికి ప్రధాని మోదీ... మంత్రులు, అధికారులతో చంద్రబాబు సమీక్ష

**అమరావతి,కలంకౌంటర్ :** మే 2వ తేదీన అమరావతి నిర్మాణ పనుల పునఃప్రారంభోత్సవానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రాష్ట్రానికి వస్తున్న నేపథ్యంలో... ఏపీ సీఎం చంద్రబాబు ఈ సాయంత్రం మంత్రులు, ఉన్నతాధికారులతో ఉండవల్లిలోని తన నివాసంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రధాని పర్యటనలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూడాలని ఆదేశించారు. అమరావతి అందరి రాజధాని అని స్పష్టం చేశారు.

# మత్స్యకారుల అభివృద్ధే సీఎం చంద్రబాబు లక్ష్యం

● రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత ● చేపల వేట నిషేధ సమయంలో ఆర్థిక సాయం రెట్టింపుపై మంత్రి హర్షం ● రూ.259 కోట్లతో 1,29,178 మత్స్యకార కుటుంబాలకు లబ్ధి ● చేపల ఎగుమతుల్లో మనమే టాప్



**అమరావతి,కలంకౌంటర్ :** చేపల వేట నిషేధ సయమంలో ఆర్థిక సాయాన్ని రెట్టింపు చేస్తూ, మరో ఎన్నికల హామీని సీఎం చంద్రబాబునాయుడు నెరవేర్చారని, మత్స్యకారులను అన్ని విధాలా అభివృద్ధి చేయడమే ఆయన లక్ష్యమని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత స్పష్టంచేశారు. ఈ మేరకు ఆదివారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. ఆది నుంచి టీడీపీ హయాంలోనే మత్స్యకారులకు మేలు జరుగుతోందన్నారు. గతంలో చేపల వేట నిషేధ సమయంలో మత్స్యకారులకు రూ.10 వేల ఆర్థిక సాయం అందించే వారన్నారు. మత్స్యకారుల ఆర్థిక ఇబ్బందులను గుర్తించిన సీఎం చంద్రబాబునాయుడు... గత ఎన్నికల ముందు చేపల వేట నిషేధ సయమంలో ఇచ్చే ఆర్థిక సాయం రూ.10 వేలను రెట్టింపు చేస్తూ రూ.20 వేలు అందిస్తామని హామీ ఇచ్చిన విషయాన్ని మంత్రి గుర్తు చేశారు. ఇచ్చిన హామీకి కట్టుబడుతూ, రాష్ట్ర వ్యాప్తంగా 1,29,178 మత్స్యకార కుటుంబాలకు రూ.20 వేల చొప్పున రూ.259 కోట్లను అందజేయడంపై ఆమె హర్షం వ్యక్తం చేశారు.

**మా ప్రభుత్వ హయాంలోనే మత్స్యకారులకు లబ్ధి..** చేపల వేట నిషేధ సమయంలో మత్స్యకార కుటుంబాలకు భృతిని ప్రవేశ పెట్టిన ఘనత సీఎం చంద్రబాబుదేనని మంత్రి సవిత గుర్తు చేశారు. 2014లో తొలిసారిగా మత్స్యకారులకు ఆర్థియం అందించారన్నారు. 2014-19 మధ్య మత్స్యకారుల సంక్షేమం కోసం ఆనాటి చంద్రబాబునాయుడి ప్రభుత్వం రూ.788 కోట్లు ఖర్చు చేసిందన్నారు. ఆ నిధులతో పాటు వలలు, పడవలు, ఐస్ బాక్సులు అదనంగా అందజేశామన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో 68,396 మంది మత్స్యకారులకు నెలనెలా పింఛన్లు అందిస్తున్నామన్నారు. ప్రమాదవశాత్తు మత్స్యకారులు చేపల వేట సమయంలో ప్రాణాలు కోల్పోతే బాధిత కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియో చెల్లిస్తున్నామన్నారు. చేపల వేటకు వెళ్లే బోట్లకు లీటర్ డీజిల్‌పై రూ.9 సబ్సిడీ ఇస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో 555 మత్స్యకార గ్రామాలున్నాయని, ఆయా గ్రామాల అభివృద్ధికి ఎన్నో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని తెలిపారు. 2019-24 మధ్య జగన్ ప్రభుత్వం మత్స్యకారుల అభివృద్ధిపై చిన్నచూపు చూసిందన్నారు. ఫిష్ ఆంధ్ర అంటూ రూ.300 కోట్లు ఖర్చు చేసినా, ఒక్క మత్స్యకారుని కుటుంబానికి కూడా ఎటువంటి మేలు జరగలేదని మంత్రి సవిత మండిపడ్డారు.

**చేపల ఎగుమతుల్లో మనమే టాప్..** చేపల ఎగుమతుల్లో మన రాష్ట్రమే ముందు వరుసలో ఉందని మంత్రి సవిత వెల్లడించారు. దేశంలో ఉత్పత్తయ్యే మత్స్య సంపదలో 29 శాతం ఏపీ నుంచే ఉంటోందన్నారు. మత్స్య సంపద ఎగుమతుల్లో 32 శాతం ఏపీ నుంయి జరుగుతోందన్నారు. మత్స్య ఉత్పత్తుల ద్వారా 16.50 లక్షల మందికి ఉపాధి లభిస్తోందన్నారు. చేపలను ఆహారంగా తీసుకోవడం వల్ల ఆరోగ్యంతో పాటు పిల్లల మెదడు చురుగ్గా పనిచేస్తుందని మంత్రి సవిత తెలిపారు.

# నిన్నటి విధ్వంసం నుంచి రేపటి వికాసం వైపు అమరావతి

(మొదటిపేజీ తరువాయి)

మొన్న జరిగిన ఢిల్లీ భేటీలో పలు సూచనలు చేశారని సిఎం గుర్తు చేశారు.

**ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు :** ఈ సందర్భంగా ప్రజెంటేషన్ ద్వారా అధికారులు 2వ తేదీ కార్యక్రమ నిర్వహణ క్రమాన్ని, ఏర్పాట్లను వివరించారు. వివిధ జిల్లాల నుంచి వచ్చే ప్రజలకు అసౌకర్యం కలగకుండా, ట్రాఫిక్ అంతరాయాలు లేకుండా చూడాలని సిఎం సూచించారు. ఎండల తీవ్రత దృష్ట్యా దూర ప్రాంతాల నుంచి సభకు వచ్చే వారికి తాగునీరు, ఆహారం అందించాలని సిఎం సూచించారు. భద్రతా పరంగా పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని... ఇదే సమయంలో సామాన్య ప్రజలు ఇబ్బంది పడకుండా వేదిక వద్దకు చేరుకునేలా చూడాలన్నారు. ముఖ్యంగా రాజధాని గ్రామాల ప్రజలకు ఈ కార్యక్రమంలో ఎక్కువ భాగస్వామ్యం ఉంటుందని... వారంతా సభకు రావాలని భావిస్తారని సిఎం అన్నారు. రవాణా సహా ఇతర అంశాల్లో అధికారులు ఎప్పటికప్పుడు తగు సూచనలు, ప్రకటనలు చేసి ఎవరికీ అసౌకర్యం కలగకుండా చూడాలన్నారు. ఈ సమీక్షా సమావేశంలో మంత్రులు పయ్యావుల కేశవ్, అనగాని సత్యప్రసాద్, నారాయణ, కొల్లు రవీంద్ర, మనోహర్, సత్యకుమార్ హాజరయ్యారు. డీజీపీతో పాటు వివిధ శాఖల అధికారులు హాజరయ్యారు.

# జిల్లా వ్యాప్తంగా ఆకస్మిక తనిఖీలు

● 30 వాహనాలు సీజ్ ● 70 లాడ్జ్ ,హెూటల్ ,రిసార్ట్స్ లు తనిఖీ ● పోలీస్ శాఖకు ప్రజలు సహకరించాలి ● జిల్లా ఎస్పీ తుషార్ డూడి






**బాపట్ల,కలంకౌంటర్ :** పోలీస్ అధికారులు జిల్లా వ్యాప్తంగా ఏక కాలంలో సాయంత్రం 4 గంటల నుండి 6 గంటల వరకు విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. వాహనాలు, లాడ్జిలు, హెూటల్లు, రిసార్ట్స్ లతో పాటు బస్టాండ్లు, రైల్వే స్టేషన్ లు ఇతర రద్దీ ప్రదేశాలలో తనిఖీలు నిర్వహించారు. దేశంలో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని అసాంఘిక శక్తులు సంఘవిద్రోహ చర్యలకు పాల్పడే అవకాశం ఉన్నందున వారిని గుర్తించేందుకు ఈ తనిఖీలను నిర్వహించడం జరిగింది. రైల్వే స్టేషన్, బస్టాండ్లలో ప్రయాణికుల లగేజీ లను చెక్ చేసినారు. లాడ్జిలు, హెూటల్లు, రిసార్ట్స్ లలో అనుమానితుల గదులను పోలీసులు తనిఖీ చేసారు. పార్సిల్ కార్యాలయాలలో వివరాలను సేకరించారు. ఏమైనా అనుమానిత పార్సిల్ లు ఉంటే వాటిని ఎవరు పంపుతున్నారు? ఎక్కడికి పంపుతున్నారు? అను వివరాలను సేకరించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ప్రస్తుత దేశంలో నెలకొన్న పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని జిల్లా పరిధిలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తు చర్యలలో భాగంగా శనివారం సాయంత్రం 4 గంటల నుండి 6 గంటల వరకు జిల్లాలోని పోలీస్ అధికారులు సిబ్బంది వారి పరిదిలో విస్తృత తనిఖీలు నిర్వహించడం జరిగిందన్నారు. 22 రైల్వే స్టేషన్/బస్టాండ్/రద్దీ ప్రదేశాలలో యాంటీ చెక్స్ నిర్వహించి 44 మంది అనుమానితులను విచారించడం జరిగిందన్నారు. జిల్లాలోని 70 లాడ్జ/హెూటల్/రిసార్ట్స్ లను తనిఖీ చేయడం జరిగిందని తెలిపారు. 46 ప్రదేశాలలో 504 వాహన తనిఖీ చేసి 30 సరైన పత్రాలు లేని అనుమానిత వాహనాలను సీజ్ చేయడం జరిగిందన్నారు. లాడ్జిలు, హెూటల్లు, రిసార్ట్స్ ల నిర్వాహకులు అప్రమత్తంగా ఉండాలన్నారు. బస చేయడానికి వచ్చే వారి గుర్తింపు పత్రం తీసుకోవాలన్నారు. వారు ఏ పని మీద వచ్చారు? ఎన్ని రోజులు ఉంటారు? అను వివరాలను నమోదు చేసుకోవాలన్నారు. ప్రవేశ ద్వారం, రిసెప్షన్, కారిడార్, లాంజ్ లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి వాటిని పరిశీలిస్తూ ఉండాలన్నారు. ఎవరి ప్రవర్తననైనా అనుమానాస్పదంగా ఉన్నట్లయితే వెంటనే సంబంధిత స్టేషన్ ఎస్.హెచ్.ఓ కు (లేదా) టోల్ ఫ్రీ నెంబర్ 112 కి కాల్ చేసి సమాచారం అందించాలన్నారు. పోలీస్ అధికారులు తనిఖీలు నిర్వహించే సమయంలో పోలీసులకు సహకరించాలని ఎస్పి తెలిపారు.

# నన్ను రాళ్లతో కొట్టి చంపమని చెప్పా.. రజతోత్సవ సభలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్

**హన్మకొండ,కలంకౌంటర్ :** హన్మకొండ జిల్లా ఎల్కతుర్తిలో బీఆర్ఎస్ రజతోత్సవ సభ అట్టహాసంగా ప్రారంభమైంది. ముందుగా జమ్మూకశ్మీర్లోని పెహల్గాం ఉగ్రదాడి మృతులకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కన్నతల్లి, జన్మభూమిని మించిన స్వర్గం లేదని అన్నారు. వరంగల్ మామూలు నేల కాదు.. ఎంతోమంది వీరుల్ని కన్న గడ్డ అని చెప్పారు. ఇవాళ ఈ గడ్డ మీద బీఆర్ఎస్ సభ పెట్టుకోవడం చాలా సంతోషంగా ఉందని హర్షం వ్యక్తం చేశారు. సరిగ్గా 25 ఏళ్ల క్రితం ఇదే రోజున గులాబీ జెండా ఎగిరిందని గుర్తుచేశారు. ఆ నాడు గులాబీ జెండాను ఎంతోమంది అవమానించారని చెప్పారు. కానీ ఎనాడూ నిరాశ చెందలేదని.. నిర్విరామంగా పోరాటం చేసి రాష్ట్రాన్ని సాధించామని అన్నారు. ఉద్యమం జెండా ఎట్టి పరిస్థితుల్లో దించే ప్రసక్తే లేదని కార్యకర్తలను మాటిచ్చాను.. జెండా దించితే నన్ను రాళ్లతో కొట్టాలని స్వయంగా చెప్పానని గుర్తుచేశారు. ఇచ్చిన మాట ప్రకారం ప్రాణాలు పోయే పరిస్థితి వచ్చినా జెండా దించలేదని అన్నారు. చీకట్లను పారద్రోలి తెలంగాణలో వెలుగులు తీసుకొచ్చామని తెలిపారు. వలసవాదుల నుంచి తెలంగాణకు విముక్తి కల్పించామని తెలిపారు. అధికారంలోకి వచ్చాక విధ్వంసమై తెలంగాణను అభివృద్ధి పథంలో నడిపించామని చెప్పారు. అనేక ఇరిగేషన్ ప్రాజెక్టులు నిర్మించుకున్నాం.. మూడేళ్లలో కాళ్లేశ్వరం కట్టాం, పంజాబ్ను తలదన్నేలా పంటలు పండించాం, దళితబంధు, రైతుబంధు, మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ, రైతుబీమా వంటి అనేక చారిత్రాత్మక పథకాలు తీసుకొచ్చి అన్ని వర్గాల ప్రజల రూపురేఖలు మార్చుకున్నామని అన్నారు. 60 ఏళ్ల కాంగ్రెస్ పాలనలో తెలంగాణ ప్రజలు ఎంతో గోసపడ్డారని తెలిపారు. ఆనాడైనా, ఈనాడైనా, ఏనాడైనా తెలంగాణకు శత్రువు కాంగ్రెస్ పార్టీనే అన్నారు. తెలంగాణ సాధించుకొస్తామని బయల్దేరిన ఉద్యమకారుల్ని ఇందిరా గాంధీ ప్రభుత్వం పిట్టల్లా కాల్చేసిందని తెలిపారు. మళ్లీ అలాంటి కాంగ్రెస్ ప్రభుత్వమే రాష్ట్రంలో అధికారంలో ఉంది.. ప్రజలంతా గమనించాలని సూచించారు.

# శివస్వామిని కలిసిన ప్రముఖులు





**గుంటూరు,కలంకౌంటర్ :** తాళ్లాయపాలెం శివ క్షేత్రం లో పీఠాధిపతి శివ స్వామి ని ఆత్మీయంగా కలిసిన ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు చిన్ని రామ సత్యనారాయణ , మాజేటి గోపాలకృష్ణ , హజరత్తయ్య గుప్తా , అమ్మ సంస్థలు అధినేత మాటూరి రంగనాథ్ ,రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ యువజన విభాగం నాయకుడు చిన్ని సాయి కుమార్ తదితరులు.

# ఉగ్ర దాడుల నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా ఆకస్మిక తనిఖీలు - జిల్లా ఎస్పీ వకుల్ జిందల్









**విజయనగరం,కలంకౌంటర్ :** దేశంలో ఉగ్రవాదులు కాశ్మీర్ రాష్ట్రం పహల్గాం ప్రాంతంలో దాడులకు తెగబడి, భారతీయులపై కాల్పులకు పాల్పడడంతో అప్రమత్తమై, జిల్లా వ్యాప్తంగా ఏకకాలంలో ఆకస్మికంగా వాహన తనిఖీలు, లాడ్జిలు, హెరిటల్స్, పబ్లిక్ ప్రాంతాల్లోను తనిఖీలు చేపట్టినట్లుగా జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ మాట్లాడుతూ దేశంలో ఉగ్రవాదులు జమ్ము కాశ్మీర్ ప్రాంతంలో దాడులకు తెగబడిన నేపథ్యంలో అప్రమత్తమై, జిల్లా వ్యాప్తంగా ఆకస్మికంగా వాహనాలు, లాడ్జిలు, హెరిటల్స్, పబ్లిక్ ప్రాంతాలు, బస్టాండులు, రైల్వే స్టేషన్లులో తనిఖీలు చేపట్టామన్నారు. జిల్లా వ్యాప్తంగా ఏక కాలంలో తనిఖీలు ప్రక్రియ చేపట్టామన్నారు. ఈ తనిఖీల్లో పోలీసు అధికారులు, సిబ్బంది బృందాలుగా ఏర్పడి, రైల్వే స్టేషన్లు, బస్టాండులు, ప్రధాన జంక్షన్లు వద్ద ఆకస్మికంగా తనిఖీలు చేపట్టి, అనుమానితుల బ్యాగులను తనిఖీ చేసామన్నారు. పోలీసుశాఖకు చెందిన స్నిఫర్ డాగ్స్, బాంబ్ డిస్పోజల్ బృందాలు ముఖ్య కూడళ్ళు, రైల్వే స్టేషన్లు, బస్టాండుల వద్ద బాంబ్లను గుర్తించే ప్రత్యేకమైన ఇక్విప్మెంట్ తో తనిఖీలు చేపట్టారు. జిల్లాలోకి ప్రవేశించి ప్రధాన మార్గాలు, సరిహద్దు జిల్లాలకు వెళ్ళే ముగింపు ప్రాంతాల్లోని ప్రధాన రహదారుల వద్ద పోలీసు బృందాలు తనిఖీలు చేపట్టి, 615 వాహనాలను క్షుణ్ణంగా తనిఖీలు చేసారు. అదేవిధంగా అనుమానిత వ్యక్తులను గుర్తించేందుకు లాడ్జిలు, హెరిటల్స్ ఆకస్మికంగా తనిఖీలు చేపట్టి, బస చేసే వ్యక్తులు ఎందుకు వచ్చింది, ఏ పని మీద వచ్చింది తెలుసుకొని, వారి గుర్తింపు కార్డులను పరిశీలించి, అనుమానితుల వేలిముద్రలను ఫింగర్ ప్రింట్స్ డివైజ్లతో తనిఖీ చేసి, వారి నేరచరిత్రను పరిశీలించారు. తనిఖీల్లో 13మంది వ్యక్తులు ఇతర ప్రాంతాల నుండి వివిధ పనుల మీద జిల్లాకు వచ్చి, లాడ్జిల్లో బస చేస్తున్నట్లుగా గుర్తించామని జిల్లా ఎస్పీ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 17 ప్రాంతాల్లో ఏంటి సేబిటేజ్ తనికీలు చేపట్టినట్లుగా జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు. ఈ ఆకస్మిక తనిఖీలను విజయనగరం డిఎస్పీ ఎం.శ్రీనివాసరావు, బొబ్బిలి డిఎస్పీ జి.భవ్యరెడ్డి, చీపురుపల్లి డిఎస్పీ ఎస్.రాఘవులు పర్యవేక్షించగా, సంబంధిత సిఐలు, ఎస్ఐలు, డాగ్ స్క్వాడ్ బృందాలు, బి.డి.టీం బృందాలు, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది తనిఖీల నిర్వహణలో పాల్గొన్నారు.







వైసీపీ గోపాలపురం మండల విస్తృత స్థాయి సమావేశంలో పాల్గొన్న మాజీ హెూమ్ మంత్రి తానేటి వనిత,మాజీ మంత్రి సి హెచ్ వేణు గోపాల్, మాజీ శాసన సభ్యుడు జక్కంపూడి రాజా,మండల పార్టీ అధ్యక్షుడు వెలగా శ్రీరామమూర్తి

–గోపాలపురం (ప.గో. జిల్లా),కలంకౌంటర్ :





# క్యాన్సర్ వ్యాధిని తొలి దశలో గుర్తిస్తే నియంత్రణ సాధ్యం




**మచిలీపట్నం,కలంకౌంటర్ :** క్యాన్సర్ వ్యాధిని తొలి దేశంలోనే గుర్తిస్తే నియంత్రించవచ్చని మణిపాల్ ఆసుపత్రి వైద్యులు డా.ఆర్జే దినేష్ రెడ్డి అన్నారు. స్థానిక గాంధీనగర్ వాకర్స్ భవనంలో ఆదివారం ఉదయపు నడక మిత్రమండలి మరియు మహిళా విభాగం ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న డా.దినేష్ రెడ్డి క్యాన్సర్ వ్యాధులు, తీసుకొనవలసిన జాగ్రత్తలు, నియంత్రణ అనే అంశంపై ప్రసంగించారు. ఇంటిలో తయారుచేసిన ఆహార పదార్థాలు తినడం వలన క్యాన్సర్ ను నియంత్రించవచ్చని అన్నారు. మహిళలలో రొమ్ము క్యాన్సరు, సర్వైకల్ క్యాన్సర్ ఎక్కువగా కనిపిస్తున్నదని అన్నారు. 40 సంవత్సరములు నిండిన ప్రతి మహిళ ప్రతి సంవత్సరం మామోగ్రామ్ పరీక్షలు చేయించుకొనుట ద్వారా రొమ్ము క్యాన్సర్ ను గుర్తించవచ్చని అన్నారు. అలాగే 30 సంవత్సరాలు దాటిన మహిళలు పాప్స్మియర్ పరీక్ష చేయించుకోవడం వలన సర్వైకల్ క్యాన్సర్ ను గుర్తించి నియంత్రించవచ్చని అన్నారు. మద్యపానం, ధూమపానం వలన పురుషులు ఊపిరితిత్తుల క్యాన్సర్ బారిన పడే అవకాశం ఉందన్నారు. వారు ప్రోస్టేట్ క్యాన్సర్ ను ఎండోస్కోపీ బయోస్కోపీ పరీక్షల ద్వారా గుర్తించవచ్చని అన్నారు. ఉదయపు నడక, యోగ, వ్యాయామం, మంచి ఆహారపు అలవాట్లతో క్యాన్సర్ వ్యాధి దూరం అవుతుందన్నారు. ఈ సమావేశంలో నడక మిత్రమండలి అధ్యక్ష కార్యదర్శులు జల్లు మురళీనాథ్, ఘంటసాల రాము, జోన్ చైర్ పర్సన్ కారుమూరి రాజేంద్రప్రసాద్, పూర్వ డిప్యూటీ గవర్నర్ వై జగన్మోహన్రావు, మహిళా విభాగం అధ్యక్ష కార్యదర్శులు లంకిశెట్టి నీరజ, విన్నకోట సత్యవతి ( సంధ్య )తదితరులు పాల్గొన్నారు.

# ఏడాదిన్నర పాలనలో ఏం చేశారు?

- ప్రభుత్వం అన్ని రంగాల్లో ఫెయిల్
- తెలంగాణకు నెంబర్ వన్ విలన్ కాంగ్రెస్సే
- బీఆర్ఎస్ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి కే. చంద్రశేఖర్‌రావు

**వరంగల్,కలంకౌంటర్ :** కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రంగాల్లో ఫెయిల్ అయ్యిందని, ఏడాదిన్నర పాలనలో ఏం చేశారంటూ బీఆర్ఎస్ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి కే. చంద్రశేఖర్‌రావు నిలదీశారు. సంచులు నింపుడు.. మోయడంలోనే కాంగ్రెస్ పాస్ అయ్యిందంటూ మండిపడ్డారు. వరంగల్ శివారులోని ఎల్కతుర్తిలో 'రజతోత్సవ సభ'పేరిట నిర్వహించిన భారీ బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ ఒక్కడిగా బయల్దేరి తెలంగాణ ఉద్యమానికి శ్రీకారం చుట్టానని, 25 ఏళ్లనాడు గులాబీ జెండా ఎగరేశాం.. ఉద్యమంతో తెలంగాణ రాష్ట్రం తెచ్చుకున్నాం.. అందరూ అశ్చరపోయేలా పదేళ్లపాటు తెలంగాణను పాలించామని కేసీఆర్ అన్నారు.

**తెలంగాణకు నెంబర్ వన్ విలన్ కాంగ్రెస్సే..** "తెలంగాణ ఉద్యమం నుంచి వెనక్కిపోతే నన్ను రాళ్లతో కొట్టి చంపమని చెప్పా. ఆనాడు పదవుల కోసం టీడీపీ, కాంగ్రెస్ వాళ్లు.. పెదవులు మూశారు. బీఆర్ఎస్ నేతలు పదవులను త్యాగం చేశారు. ఆనాడైనా ఈనాడైనా తెలంగాణకు నెంబర్ వన్ విలన్ కాంగ్రెస్సే. ప్రజలు ప్రాణం పోసి ఊపిరి ఊదితే అద్భుతమైన ఉద్యమాన్ని నిర్మించాం. బలవంతంగా ఆనాడు తెలంగాణను ఆంధ్రాలో విలీనం చేసింది కాంగ్రెస్సే. కాంగ్రెస్ మెడలు వంచి తెలంగాణను సాధించుకున్నాం. నేను ఆమరణ దీక్షకు దిగితే కాంగ్రెస్ దిగవచ్చి తెలంగాణపై ప్రకటన చేసింది" అని కేసీఆర్ గుర్తు చేశారు.

**డ్యాన్స్‌లు చేసి హామీలు ఇచ్చారు..** "పదేళ్ల పాలనలో తెలంగాణను అనేక రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపాం. తెలంగాణ అంటే ఒక్కప్పుడు వెనకబడిన ప్రాంతం. మన పాలనలో రూ.90 వేలు ఉన్న తలసరి ఆదాయం మూడున్నర లక్షలకు పెంచుకున్నాం. మూడేళ్లలో కాళేశ్వరం కట్టుకున్నాం. పడావు భూములను పంటపొలాలుగా మార్చుకున్నాం. పంజాబ్‌ను తలదన్నే పంటలను పండించుకున్నాం. రైతాంగాన్ని కడుపులో పెట్టి చూసుకున్నాం. గోల్‌మాల్ చేయడంలో అబద్ధాలను చెప్పడంలో కాంగ్రెస్‌ను మించినవారు లేరు. మాట్లాడితే కేసీఆర్‌పై నిందులు వేస్తున్నారు. ఇక్కడ ఉన్నవాళ్లు చాలరని.. ఢిల్లీ నుంచి గాంధీలు వచ్చి డ్యాన్స్‌లు చేసి హామీలు ఇచ్చారు" అంటూ కేసీఆర్ మండిపడ్డారు.

**ఆశపడి.. కాంగ్రెస్‌ను నమ్మి ప్రజలు మోసపోయారు..** "కల్యాణ లక్ష్మికి కేసీఆర్ లక్ష రూపాయలే ఇస్తున్నారు.. మేము వస్తే తులం బంగారం కూడా ఇస్తామన్నారు. పెన్షన్లు పెంచుతామన్నారు.. స్కూటీలు కొనిస్తామన్నారు.. జాబ్ కార్డులు ఇస్తామన్నారు.. ఇచ్చారా?. ఇప్పుడు ఆర్థిక మంత్రిగా ఉన్న ఆయన.. ఎన్ని హామీలైనా అమలు చేసి చూపిస్తామన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణలో ఉన్న దేవుళ్ల అందరిపైనా ఒట్లు వేశారు. మహిళలే ఆర్టీసీలో ఉచిత ప్రయాణం వద్దని అంటున్నారు. ఆశపడి.. కాంగ్రెస్‌ను నమ్మి ప్రజలు మోసపోయారు. మమ్మల్ని ఎవరూ నమ్మడం లేదు.. అప్పు పుట్టడం లేదని.. ఇప్పుడు కాంగ్రెస్ వాళ్లు అంటున్నారు. తెలంగాణ ఆర్థిక పరిస్థితిని దెబ్బతీశారు.. పరిపాలన చేయడం రాక రాష్ట్రాన్ని ఆగమాగం చేశారు. తెలంగాణను నంబర్‌వన్ స్థానంలో నిలబెడితే.. ఇప్పుడు 14వ స్థానానికి తీసుకెళ్లిపోయారు. హైడ్రా పేరు చెప్పి పేదల ఇళ్లు కూలగొడుతున్నారు" అని కేసీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

**ఇక నుంచి నేను కూడా ఊరుకోను..** యూనివర్శిటీ భూములను ఎవరైనా అమ్ముతారా?. కేసీఆర్ కిట్స్‌ను ఎందుకు బంద్ చేశారు? ఎవరైనా వాటిని ఆపుతారా?. ఇవాళ హైదరాబాద్ యూనివర్శిటీ రేపు ఉస్మానియా యూనివర్శిటీ అమ్మేస్తారు. వైఎస్సార్ తెచ్చిన ఆరోగ్యశ్రీని కొనసాగించాలని చెప్పాను. ఆరోగ్యశ్రీ పథకం మంచిది.. కొనసాగించాలని నేను సీఎం అయ్యాక చెప్పాను. ఇప్పుడున్న సీఎం కేసీఆర్ ఆనవాళ్లు లేకుండా చేస్తామంటున్నారు. ఇక నుంచి నేను కూడా ఊరుకోను. ఎక్కడ ఎవరు బీఆర్ఎస్ నేతలపై కేసులు పెట్టినా న్యాయస్థానాల్లో పోరాడదాం. కమీషన్లు అడుతున్నారని కాంట్రాక్టర్లు అంటున్నారు. ఈ సోది కబుర్లు వినడానికి నేను అసెంబ్లీకి రావాలా?" అని కేసీఆర్ వ్యాఖ్యానించారు.

**ఆపరేషన్ కగార్ వెంటనే ఆపేయాలి..** ఆపరేషన్ కగార్ వెంటనే ఆపేయాలి. మావోయిస్టులతో చర్చలు జరపాలి. మావోయిస్టులను ఏరిపారేస్తామనడం సరికాదు. ప్రజాస్వామ్యంలో ఇది మంచి పద్ధతి కాదు. బీఆర్ఎస్ శ్రేణులు ధైర్యంగా ఉండాలి. తెలంగాణను మళ్లీ అద్భుతంగా చేసుకుందాం. ప్రభుత్వాన్ని పడగొట్టే ఆలోచన మాకు లేదు. కాంగ్రెస్ సంగతేంటో ప్రజలే తేలుస్తారు. పోలీసులు ఎందుకు అత్యుత్సాహం చేస్తున్నారు. పోలీసులు డైరీల్లో రాసుకోండి. మళ్లీ వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమే. బీఆర్ఎస్ రాకుండా ఎవరు కూడా ఆపలేరు. పోలీసులకు రాజకీయాలు ఎందుకు?. మీ డ్యూటీ మీరు చేయండి" అంటూ కేసీఆర్ హెచ్చరించారు.

# అపూర్వ కలయిక



**తిరువూరు,కలంకౌంటర్ :** తిరువూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల 1998–2001 విద్యా సంవత్సర బిఏ పూర్వ విద్యార్థుల ఆత్మీ య సమ్మేళనం ఆదివారం తిరువూరులో జరి గింది. 24 సంవత్సరాల తరువాత కలుసుకున్న ఆ విద్యార్థుల్లో కొంతమంది ఒకరినొకరు గుర్తు పట్టలేక మీ పేరు అనగానే నేను రా, నేనేనే అని అనగానే వావ్ ఎంత మారిపోయావని ఆప్యా యంగా కౌగిలించుకొని ఆనాటి చిలిపి చేష్టలను గుర్తు చేసుకున్నారు. ఏమీ చేస్తున్నావు, ఏ పని చేస్తున్నావు, ఎక్కడ అంటున్నావు, పిల్లలు ఏమీ చదువుతున్నారు ఇలా ఒకరినొకరు పలకరించు కుని అనాడు ఎకనామిక్స్ బోధించిన అధ్యాప కులు యరమల ప్రతాపరెడ్డిని, లైబ్రేరియన్ ఏను గుల నరసింహారావును ఘంగా సన్మానించారు. విందు చేసిన అనంతరం వివిధ రకాల ఆటలలో ఉత్సాహంగా పాల్గొని ఈకలయిక గుర్తుగా గిఫ్ట్ అందజేశారు. పూర్వ విద్యార్థులు కె.రంగా, సుదీప్తి, డి.విజయలక్ష్మి, బి.కృష్ణారావు ఈకార్యక్రమ విజయవంతంగా జరగటానికి కృషి చేశారు.



## శ్రీ వెంకటేశ్వరస్వామిని దర్శించుకున్న రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర, మాజీ మంత్రి పీతల సుజాత తదితరులు..

-ద్వారకా తిరుమల,కలంకౌంటర్ :



# చలివేంద్రాన్ని ప్రారంభించిన జనసేన పార్టీ ఇంచార్జ్ బండి రామకృష్ణ






**మచిలీపట్నం,కలంకౌంటర్ :** నగరపాలక సంస్థ పరిధిలోని గాంధీ బొమ్మ సెంటర్ వద్ద జనసేన పార్టీ (డి.సి.) డిస్ట్రిబ్యూటరీ కమిటీ వైస్ చైర్మన్ లిశాయన శివయ్య వారి తండ్రి శాయనరాము జ్ఞాపకార్థం ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని బండి రామకృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా బండి రామకృష్ణ మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో పలుచోట్ల లిచలివేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు అనంతరం శీతల పానీయాలను పంపిణీ చేశారు. వేసవిని దృష్టిలో పెట్టుకొని చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని స్వచ్ఛంద సంస్థలు మానవతావాదులకు బండి రామకృష్ణ పిలుపునిచ్చారు. మన జన్మకు కారణమైన పితృదేవతల జ్ఞాపకార్థం చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం శుభ సూచకమని అన్నారు . కూటమి ప్రభుత్వం అనేకచోట్ల చలివేంద్రాలను ఏర్పాటు చేసిందని వేసవి పురస్కరించుకొని మూగజీవాల కొరకు ప్రత్యేక నిధిని ఏర్పరిచి ప్రతి గ్రామీణ ప్రాంతంలో నీటి తొట్టెల ఏర్పాటు జరుగుతుందని తెలిపారు.వేసవిలో పశుపక్షాదులకు నీటిని అందుబాటులో ఉంచవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని వేసవి నుండి మూగజీవాలను రక్షించుకోవాలని పిలుపునిచ్చారు స్వచ్ఛంద సంస్థలు మానవతావాదులు రహదారుల వెంట ప్రయాణికులకు పాదచారులకు వాహనదారులకు త్రాగునీరు అందుబాటు కొరకు చలివేంద్రాలను ఏర్పాటు చేసి త్రాగునీరును అందుబాటులో ఉంచాలని తెలిపారు. వేసవి ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశం ఉందని వృద్ధులు చిన్న పిల్లలు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు తప్పనిసరిగా బయటికి వచ్చినప్పుడు ఎండ నుండి రక్షణ కవచాలను వాడాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు తోటసునీత,శివ, వెంకన్నబాబు,గడ్డంరాజు,కర్రి మహేశ్,పినిశెట్టివేణు,తోట రాజేష్,చలమలశెట్టి రమేశ్,గంపలకృష్ణ, తోట భాస్కర్, కొండామేస్త్రీ,మహేంద్ర,సాయి గణేశ్,దేవనూరివీరబాబు, మంత్రి పృధ్వీ,కొల్వే పల్లి గణేశ్, జనసేన బిజెపి టిడిపి నాయకులు పుర ప్రముఖులు పాల్గొన్నారు.

## చిప్పగిరి లక్ష్మీనారాయణ హత్య తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసింది: షర్మిల

- ఆలూరు నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్చార్జి చిప్పగిరి లక్ష్మీనారాయణ హత్య
- ఏపీసీసీ అధ్యక్షురాలు షర్మిల స్పందన
- లారీతో ఢీకొట్టి, వేటకొడవళ్లతో నరికి చంపడం దారుణమని ఆవేదన
- రాష్ట్రంలో క్షీణించిన శాంతి భద్రతలకు ఇది నిదర్శనమని వ్యాఖ్య
- ఘటనపై అత్యున్నత స్థాయి విచారణ జరిపించాలని డిమాండ్




**విజయవాడ, కలంకౌంటర్ :** కర్నూలు జిల్లా ఆలూరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి చిప్పగిరి లక్ష్మీనారాయణ హత్యకు గురికావడం పట్ల ఏపీ కాంగ్రెస్ చీఫ్ షర్మిల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ దారుణ ఘటనపై ఆమె తీవ్రంగా స్పందిస్తూ, రాష్ట్రంలో శాంతి భద్రతల పరిస్థితిపై తీవ్ర ఆందోళన వెలిబుచ్చారు. లక్ష్మీనారాయణను అత్యంత కిరాతకంగా లారీతో ఢీ కొట్టించి, ఆపై వేట కొడవళ్లతో నరికి చంపడం చూస్తుంటే రాష్ట్రంలో శాంతి భద్రతలు ఎంత దారుణంగా పడిపోయాయో అర్థమవుతోందని షర్మిల ఆవేదన వ్యక్తం చేశారు. ఇంతటి దారుణమైన రీతిలో ఒక రాజకీయ నాయకుడిని హత్య చేయడం సమాజాన్ని దిగ్భ్రాంతికి గురిచేసిందని ఆమె అన్నారు. ఈ హత్యోదంతంపై పోలీసు శాఖ తక్షణమే స్పందించి, అత్యున్నత స్థాయి విచారణ చేపట్టాలని షర్మిల డిమాండ్ చేశారు. ఈ ఘాతుకానికి పాల్పడిన అసలు నింది తులను త్వరితగతిన గుర్తించి, వారికి చట్టప్రకారం కఠిన శిక్షలు పడేలా చూడాలని ఆమె పోలీసు యంత్రాంగాన్ని కోరారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకో వాల్సిన అవసరం ఉందని ఆమె నొక్కి చెప్పారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నట్లు షర్మిల పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ లక్ష్మీనారాయణ కుటుంబానికి అండగా నిలుస్తుందని, వారికి అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తుందని ఆమె భరోసా ఇచ్చారు. ఈ మేరకు షర్మిల సోషల్ మీడియాలో పోస్టు చేశారు. తన పోస్టుకు ఏపీ పోలీస్, చంద్రబాబు, పవన్ కల్యాణ్ లను ట్యాగ్ చేశారు.

# అదే మన అందం...

అమ్మ చిక్కగా నవ్విన తల లా గుంటాది
ఆవు గొబ్బెమ్మ ల్లాంటి కాశ్మీరం.
తల్లి నడువొంపుల్లో హాయిగా ఉంటూ.... ఆమె ముఖాన్ని లేత ఆకుల చేతుల్లా తడిమినట్లు ఉంటాది కదా?.... కాశ్మీరం
కల్మషం లేని అమ్మాయి మనసులా అందాలు చిందుతాయి సరస్సులు.
చంద్రుని వంటి తల బయటపెట్టి
వొళ్ళంతా దుప్పటి కప్పుకుని
సొగసుగా నడిచే కాశ్మీరం
అందరూ కోరుకొనే అమృత బిందువు.
వొంపులు తిరుగుతూ, చిరునవ్వు ను కనిపించకుండా
నవ్విన అమ్మాయిలా, మంచు వంతెనలతో, లోయలతో, కనిపించే ఆ చందనవరీ ప్రాంతం ఓ సుందరమే?
అల్లంత ఎత్తులో పందిరి మంచాల్లా బైసరన్ పచ్చిక బయళ్ళు.
చెట్లతో సరససంభాషణలు సాగించే తులియన్ సరస్సు లోని నీళ్ళు.
పచ్చిక మైదానాల కుచ్చిళ్ళలో పై కొచ్చిన తులిప్ రంగుల మొగ్గలు.
కన్నుకొట్టి ఏమీ ఎరగనట్టు చూస్తున్న అమ్మాయిలా,
లిటర్ నదీ అంతర్ధాన దృశ్యాలు.
ఒక సారి ఇటు వస్తావా అన్నీ ఇస్తా అని పిలిచే ఆరూ వ్యాలీ అద్భుత సొగసులు.
వొంపుల వయ్యారాల సింధులోయ లో
కేరింతల ట్రెక్కింగ్ ఆటలు ఆడే ఆపాత మధురాలు.
నాగుపాము లాంటి జడతో నడువొంపులు చూపిస్తూ... వొళ్ళును జిల్లు మనిపించే శేషనాగ్ సరస్సుల తీరాలు.
అమ్మాయి మనసులో అర్థంకాని సందేశాలు రాసుకొని ఆట పట్టిస్తున్నట్లుండే లిడ్డార్ వాట్ లోని దట్టమైన అడవులు.
అద్భుత కల్పనా మాధుర్యాల సినిమాలను,
ఇక్కడ కు రా అని పిలిచే బేతాబ్ వ్యాలీ అందాలు.
చలికే పాఠాలు చెప్పే స్నో లేపర్డ్ జంతువిన్యాసాలు.
అరుదుగా తచ్చటలాడుతూ కనిపించే ఆసియా టిక్ బ్లాక్ బేర్ జీవులు.
కూత కూతలో కొత్త భయాలు కల్పించే రెడ్ ఫాక్స్ లు.
చిలిపి కళ్ళకు చిరునామాలు హిమాలయాన్ మాస్క్ డీర్ లు.
ఒకటేమిటి?......
చూస్తున్న కొద్దీ.... వొంట్లో ఉత్సాహం రేగుతుంది.
ఎక్కుతున్న కొద్దీ.... ఆహ్లాదాలు వొంటికి అంటుకు పోతాయి.
తింటున్నకొద్దీ ..... కుంకుమ పువ్వులా వొళ్ళు ఎర్ర బారుతుంది.
కాశ్మీర్!!!!!!!!!
వొళ్ళంతా సింగారం పరచుకొన్న లేత గులాబీ.
అందుకే.......
ముళ్ళున్న ముదరష్టపోళ్ళు తయారయ్యారు.
కొండల్లో కోనల్లో బాంబులతో ఘాతాలు తవ్వేశారు.
మనసుల్లో సూదులు పెట్టుకొని.........
కళ్ళల్లో కత్తులు పెట్టుకొని..........
చేతుల్లో తుపాకులు పట్టుకొని.....
తూనీగల్లా ఆ ముఖ కాశ్మీరం పై వాలడం ఎంత దురదృష్టం.
భారతీయుల బతుకు గాథల్లో
ఈ సంఘటన లే వికృతం.
వికృతం......
వికృతం.......?

**గాదంశెట్టి శ్రీనివాసులు**
**రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత**
**ఉప్పు గుండూరు ప్రకాశం జిల్లా**

# బ్రహ్మసమాజం ఆధ్వర్యంలో అన్నదాన సమారాధన



**మచిలీపట్నం,కలంకౌంటర్ :** జగన్నాథపురం లో బ్రహ్మ సమాజం ఆధ్వర్యంలో అన్నసమారాధన జరిగింది. 350 మంది ప్రజలు ఈవేసవిలో తమ క్షడబాధ ను తీర్పు కోవడం జరిగింది. ఈ కార్యక్రమం బ్రహ్మసమాజ ప్రార్థన తరువాత జరిగింది. కార్యదర్శి డా ఉడత్తు శ్రీనివాస రావు మాట్లాడుతూ కందుకూరి వీరేశలింగం పంతులు 177 వ జయంతిని పురస్కరించుకొని ఈ కార్యక్రమం జరిగిందానిచెప్పారు. కార్యక్రమం లో డా ఉడత్తు శ్రీనివాస రావు, సయ్యద్ పీర్, చిలుకోటి ప్రసాద్,, జల్లు రాము తదితరులు ప్రసంగించారు చిలుకోటి ప్రసాద్ వందన సమర్పణ చేసారు .

Printed,Published and owned by Chitta Vasavidevi Printed at Rama Offset Printers, 7th ward, Ponnuru, Guntur District-522 124 Andhra Pradesh and Published at 7th ward, Ayyappa Nagar, Ponnuru-522 124, Guntur District. Andhra Pradesh. Editor : Chitta Vasavidevi. RNI No.APTEL/2016/69464, Phone No.9346935672, kalamcounter@gmail.com